# శిఖర జనసాక్షి

www.janasakshi.in

RNI APTEL/26/A1736

తెలుగు దిన పత్రిక

గురువారం 23-04-2026


మంచి మాట

జనవిజ్ఞానం

**నిజం**

నిజం కూడా నిరంతరం ప్రచారంలో వుండాలి
లేకుంటే నిజం అబద్ధంగా మారుతుంది.
రాష్ట్రాన్ని, దేశాన్నే గాదు ప్రపంచాన్ని సైతం
ప్రమాదంలోకి నెడుతుంది!

- డా.బి.ఆర్.అంబేద్కర్


ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | విజయవాడ | శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు | ప్రకాశం | చిత్తూరు | సంపుటి : 1 | సంచిక : 28 | పేజీలు 8


### తమిళనాడువ్యాప్తంగా, బెంగాల్‌లో

## నేడు తొలి దశ ఓటింగ్



న్యూఢిల్లీ : ఐదు అసెంబ్లీ ఎన్నికలకు భాగంగా గురువారం తమిళనాడులోనూ, పశ్చిమ బెంగాల్‌లో తొలి దశ ఎన్నికలు జరగనున్నాయి. తమిళనాడులోని మొత్తం 234 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ నిర్వహిస్తుండగా, బెంగాల్‌లో 16 జిల్లాల్లోని 152 స్థానాలకు పోలింగ్‌కు జరగనుంది. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ ఓటింగ్‌కు అనుమతిస్తారు. ఉత్తర బెంగాల్‌లోని కూచ్ బెహార్, అలీపుర్‌దువార్, జల్‌పైగురి, డార్జిలింగ్, కాలింపాంగ్, ఉత్తర దినాజ్‌పూర్, దక్షిణ్ దింజాపూర్, మాల్దా జిల్లాలోనూ, దక్షిణ బెంగాల్‌లో ముర్షిదాబాద్, పశ్చిమ్ బర్ధమాన్, బీర్భూమ్, పుర్బా మేదినీపూర్, పశ్చిమ్ మెదినీపూర్, బంకురా, పురూలియా, ఝర్‌గ్రామ్ జిల్లాల్లోనూ ఎన్నికలు జరగనున్నాయి. బెంగాల్‌లో ఎన్నికల కోసం ఇసి భారీ ఏర్పాట్లను చేసింది. దాదాపు 2.5 లక్షల మంది సిబ్బందితో పాటు రికార్డు స్థాయిలో 2,450 కంపెనీల కేంద్ర పారామిలిటరీ బలగాలను

మిగతా 2లో..

# మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు కన్నుమూత..



- అనారోగ్య, వృద్ధాప్య సమస్యలతో హైదరాబాద్ కాంటినెంటల్ ఆసుపత్రిలో కన్నుమూత
- నేడు పంజాగుట్ట శ్మశానవాటికలో అంత్యక్రియలు
- 1984లో నెల రోజుల పాటు సీఎంగా ఉన్న నాదెండ్ల

అమరావతి,/ శిఖర జనసాక్షి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు (90) కన్నుమూశారు. అనారోగ్య కారణాలు, వృద్ధాప్య సమస్యలతో హైదరాబాద్ లోని కాంటినెంటల్ ఆసుపత్రిలో గత నెల రోజులుగా చికిత్స పొందుతున్న నాదెండ్ల... కాసేపటి క్రితం తుదిశ్వాస విడిచారు. నాదెండ్ల భాస్కరరావు కుమారుడే ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్. ఆయన అంత్యక్రియలను పంజాగుట్ట శ్మశానవాటికలో రేపు సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. నాదెండ్ల మృతి పట్ల ఇరు తెలుగు రాష్ట్రాల రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. 1935 జూన్ 23న గుంటూరు జిల్లాలో నాదెండ్ల భాస్కరరావు జన్మించారు. కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చిన ఆయన... 1978లో విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1982లో ఎన్టీఆర్ టీడీపీ స్థాపించిన సమయంలో ఆ పార్టీలో చేరారు. 1984లో చికిత్స కోసం ముఖ్యమంత్రి ఎన్టీఆర్ అమెరికా వెళ్లిన సమయంలో... కొంత మంది ఎమ్మెల్యేల మద్దతులో నాదెండ్ల సీఎం అయ్యారు.

మిగతా 2లో..



# హామీల అమలుకు న్యాయపోరాటం

### అన్నీ గుర్తున్నాయి..
### వడ్డీతో సహా చెల్లిద్దాం : వైఎస్ జగన్



కడప ,/ శిఖర జనసాక్షి

మూడు సంవత్సరాలు పాటు ఆగితే అధికారంలోకి వచ్చేది మనమేనని, హామీల అమలు కోసం పోరాటం చేస్తామని, అన్ని గుర్తున్నాయని, వడ్డీతో సహా చెల్లిద్దామని నాయకులకు, కార్యకర్తలకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా

మిగతా 2లో..

# ఆందోళనకరంగా జననాల రేటు

## సమీక్షలో సిఎం

అమరావతి,/ శిఖర జనసాక్షి

రాష్ట్రంలో జననాల రేటు అందోళనకరంగా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. పాపులేషన్ మేనేజ్మెంట్పై బుధవారం ఆయన కీలక శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 1.5 శాతంగా జననాల రేటు ఉందని ఈ సమావేశంలో అధికారులు సీఎంకు

మిగతా 2లో..



# రాష్ట్రంలో ఎండల తీవ్రత

## తిరుపతి జిల్లాలో అత్యధికంగా 44.4 డిగ్రీల ఉష్ణోగ్రత

### రాష్ట్రంలో తీవ్ర ప్రభావం ఎండలు, వడగాలులు

### ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారుల సూచనలు

అమరావతి,/ శిఖర జనసాక్షి

రాష్ట్రంలో ఎండలు, వడగాలులు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఇవాళ తిరుపతి జిల్లా వరదయ్యపాలెంలో అత్యధికంగా 44.4 డిగ్రీల సెల్సియస్, ప్రకాశం జిల్లా కొప్పెరపాడులో 44.1 డిగ్రీల సెల్సియస్ డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రేపు

మిగతా 2లో..



# ఏప్రిల్ 24న సిట్ ముందు హాజరు కావాలి

## లిక్కర్ కేసుపై రాజ్‌కెసిరెడ్డికి హైకోర్టు ఆదేశం

**అమరావతి,/ శిఖర జనసాక్షి**

**ఈనెల 24న సిట్ ముందు హాజరు కావాలని వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో మద్యం రవాణాలో మహా దోపిడీకి పాల్పడిన కేసులో ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డిని హైకోర్టు ఆదేశించింది. విచారణకు హాజరుకావాలంటూ సిట్ ఇచ్చిన నోటీసుకు కట్టుబడాల్సిందేనని కెసిరెడ్డికి తేల్చి చెప్పింది. ముందస్తు బెయిలుపై విచారణను ఈనెల 24వ తేదీకి వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు.**




వైఎస్సార్సీపీ హయాంలో ఏపీఎస్‌బీసీఎల్ డిపోల నుంచి ప్రభుత్వ దుకాణాలకు మద్యం రవాణా కాంట్రాక్టుల్లో రూ.200 కోట్ల నుంచి రూ.400 కోట్ల వరకు దోచుకున్న వ్యవహారంపై సీఐడీ ఈ ఏడాది ఫిబ్రవరి 10న కేసు నమోదు చేసింది. వైఎస్సార్సీపీ ముఖ్య నేతల్లో పలువురు రెండు,మూడేసి జిల్లాలను వంతులేసుకుని బినామీలను ముందుపెట్టి మద్యం రవాణా పేరుతో ప్రభుత్వ ఖజానాకు రూ.కోట్ల మేర నష్టం కలిగించారని సీఐడీ పేర్కొంది. ప్రస్తుతం ఈ కేసు దర్యాప్తును సిట్ నిర్వహిస్తోంది. ఈ కేసులో ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డి ముందస్తు బెయిలు కోసం హైకోర్టులో పిటిషన్ వేశారు. మంగళవారం జరిగిన విచారణలో పిటిషనర్ తరపు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ దవే, న్యాయవాది అభయ్‌సిద్ధాంత్ వాదనలు వినిపించారు. ముందస్తు బెయిలు పిటిషన్‌పై అత్యవసర విచారణ జరపాలని కోరారు.

ఏప్రిల్ 24న హాజరు కావాలని హైకోర్టు ఆదేశం: విచారణకు హాజరుకావాలంటూ కెసిరెడ్డికి వాట్సాప్ ద్వార తరచూ నోటీసులిస్తున్నారన్నారు. ప్రయాణం చేసి సిట్ ముందు హాజరు అయ్యేందుకు తగిన సమయం ఇవ్వడం లేదన్నారు. నోటీసులకు స్పందించడం లేదని, విచారణకు సహకరించడం లేదనే కారణంతో అరెస్ట్ చేసే ప్రమాదం ఉందన్నారు. సిట్ తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ ఈ పిటిషన్‌పై అత్యవసరంగా విచారణ జరపాల్సిన అవసరం లేదన్నారు. రాష్ట్రం వెలుపల ఉంటూ కెసిరెడ్డి దర్యాప్తునకు సహకరించడం లేదన్నారు. ఇరువైపు వాదనలు విన్న న్యాయమూర్తి ఈనెల 24న సిట్ ముందు హాజరుకావాలని కెసిరెడ్డిని ఆదేశించారు.

ప్రధాన సూత్రధారిగా కీలకపాత్ర: వైఎస్సార్సీపీ సర్కార్?లో జరిగిన మద్యం కుంభకోణంలో నాటి ప్రభుత్వ పెద్దల తరపున అన్ని తానై కెసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి (రాజ్ కెసిరెడ్డి) కీలక పాత్రధారిగా వ్యవహరించారు. 2019 ఎన్నికలకు ముందు వైఎస్ జగన్ మోహన్?రెడ్డితో కలసి పనిచేసిన ఆయన వైఎస్సార్సీపీ అధికారంలోకి రాగానే ప్రభుత్వ ఐటీ సలహాదారుగా నియమితులయ్యారు. ఆ పదవిలో ఉంటూనే తెరవెనుక లిక్కర్ స్కాంలో కీలక పాత్ర పోషించారు. అప్పట్లో ప్రభుత్వమే నిర్వహించిన మద్యం షాపులకు జే బ్రాండ్ల మద్యం సరఫరాలో ఈయన ఆదేశాలు కీలకంగా పని చేశాయి.

కమీషన్లు చెల్లించిన కంపెనీల నుంచి ప్రతి నెలా రూ.60 కోట్లకు తగ్గకుండా వసూలు చేసి దాదాపు రూ.3500 కోట్లపైనే కొలగొట్టినట్లు సిట్ తేల్చింది. లంచాల నెట్‌వర్క్‌ను రూపొందించడంతో పాటు వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో పేరున్న ఓ నేతతో కలిసి హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ప్రత్యేకంగా కార్యాలయమే ఏర్పాటు చేసి దందా నిర్వహించినట్లు ఆధారాలు లభించాయి. ఏ మద్యం కంపెనీ నుంచి ఎంత సరుకు కొనుగోలు చేయాలో ఏ రోజు, ఏ బ్రాండ్లు ఎంత మేరకు విక్రయించాలో రాజ్ కెసిరెడ్డే నిర్ణయించేవారని సిట్ నిర్ధారించింది.

## తమిళనాడువ్యాప్తంగా, బెంగాల్‌లో నేడు తొలి దశ ఓటింగ్

మొహరించింది. ఏఐ మద్దతుతో 152 నియోజకవర్గాల్లోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్‌ను అమలు చేస్తోంది. బెంగాల్‌లోని మిగిలిన 142 స్థానాలకు ఈ నెల 29న రెండో దశలో పోలింగ్ నిర్వహిస్తారు. దీంతో ఐదు అసెంబ్లీకు ఎన్నికలు పూర్తవుతాయి. మే 4న ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

## మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు కన్నుమూత..

నెల రోజుల పాటు సీఎంగా ఉన్న నాదెండ్ల... ఆ తర్వాత మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో సీఎం పదవికి రాజీనామా చేశారు. ఆ తర్వాత మళ్లీ కాంగ్రెస్ పార్టీలో చేరారు. 1989లో తెనాలి నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. 1994 ఎన్నికల్లో ఓటమిపాలయ్యారు. 1998లో ఖమ్మం నుంచి ఎంపీగా పోటీ చేసి గెలుపొందారు. ఆ తర్వాత నుంచి రాజకీయాలకు దూరంగా ఉన్నారు. మర్రి చెన్నారెడ్డి, అంజయ్య, ఎన్టీఆర్ హయాంలో నాదెండ్ల మంత్రిగా బాధ్యతలను నిర్వర్తించారు.

**మాజీ సీఎం నాదెండ్ల భాస్కరరావు మృతిపట్ల సీఎం చంద్రబాబు సంతాపం**

**మంత్రి నాదెండ్ల మనోహర్ కు ఫోన్ లో ముఖ్యమంత్రి పరామర్శ**

మాజీ సీఎం నాదెండ్ల భాస్కర రావు మృతి పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంతాపం తెలిపారు. భాస్కరరావు తనయుడు, క్యాబినెట్ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు ఫోన్ చేసి పరామర్శించారు. నాదెండ్ల మనోహర్ కుటుంబ సభ్యులకు తన సానుభూతి తెలిపిన ముఖ్యమంత్రి... ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

**శ్రీ నాదెండ్ల భాస్కరరావు గారి ఆత్మకు శాంతి చేకూరాలి : పవన్ కల్యాణ్**

ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి శ్రీ నాదెండ్ల భాస్కర రావు గారు తుది శ్వాస విడిచారని తెలిసి చింతిస్తున్నాను. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను. శ్రీ నాదెండ్ల భాస్కరరావు గారు 70వ దశకం నుంచి ప్రజా జీవితంలో ఉన్నారు. న్యాయవాదిగా, రాజకీయవేత్తగా ఆయనకున్న పరిజ్ఞానం ఎంతో విలువైనది. విజయవాడ ఈస్ట్, వేమూరు నియోజకవర్గాల నుంచి ఎమ్మెల్యేగా, ఖమ్మం నుంచి ఎంపీగా గెలిచి సేవలందించారు. నాదెండ్ల భాస్కరరావు గారి కుమారుడు, నా సహచర మంత్రి, జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ శ్రీ నాదెండ్ల మనోహర్ గారు పితృ వియోగం బాధ నుంచి త్వరగా కోలుకోవాలి. శ్రీ మనోహర్ గారికి, ఇతర కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నాను.

**నాదెండ్ల భాస్కరరావు మరణం రాష్టానికి తీరని లోటు: జగన్**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు ఈ రోజు కన్నుమూసిన సంగతి తెలిసిందే. వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్ లోని కాంటినెంటల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఆయన మృతి పట్ల రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ అధినేత జగన్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ... నాదెండ్ల భాస్కరరావు మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. ఏపీ రాజకీయాల్లో నాదెండ్ల భాస్కరరావు విశిష్ట స్థానం సంపాదించారని అన్నారు. ప్రజాసేవలో ఆయన నిబద్ధత, రాజకీయ అనుభవం తరతరాలకు ఆదర్శమని చెప్పారు. ఆయన మరణం రాష్ట్రానికి తీరని లోటు అని ఆవేదన వ్యక్తం చేశారు.

**మాజీ సీఎం నాదెండ్ల భాస్కరరావు మృతి దిగ్భ్రాంతికి గురిచేసింది**

**- మంత్రి కొలుసు పార్థసారథి**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రివర్యులు, రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రివర్యులు శ్రీ నాదెండ్ల మనోహర్ గారి తండ్రి శ్రీ నాదెండ్ల భాస్కరరావుగారు మృతి చెందారన్న వార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నాను. బాధాతప్తశోక హృదయాలతో ఉన్న వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. భాస్కరరావుగారి కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు మనోనిబ్బరాన్ని, ధైర్యాన్ని ప్రసాదించాలని కోరుకుంటున్నాను.

## ఆందోళనకరంగా జననాల రేటు

వివరించారు. అనంతరం మాట్లాడిన ముఖ్యమంత్రి జననాల రేటును పెంచేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. అందరికీ ఆరోగ్యాన్ని అందించేందుకు సంజీవని, అభివృద్ధిలో మహిళా ఉద్యోగులు, కార్మికుల పాత్రను పెంచేందుకు శక్తి, వృద్ధుల కోసం క్షేమ, 80 శాతం వరకు ఉపాధి అవకాశాలను పెంచేందుకు నైపుణ్యం తదిరత పథకాలను చిత్తశుద్ధితో అమలు చేయాలని అన్నారు.. అన్ని శాఖల అధికారులు ఈ ఐదు అంశాలపై దృష్టి సారించాలని ఆదేశించారు. అంతకుముందు అధికారులు మాట్లాడుతూ విశాఖపట్నంలో అతి తకుకవగా 1.32 శాతంగా సంతానోత్పత్తి నమోదుకాగా, కడప జిల్లాలో అత్యధికంగా 1.91 శాతం గుర్తించినట్లు అధికారులు వివరించారు. ఇలాగే కొనసాగితే 2036 నాటికి వృద్ధుల జనాభా 19 శాతంగా ఉంటుందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రస్తుతం మధ్య వయసుగల వారు 32.5 శాతంగా ఉన్నారని, ఇది భవిష్యత్తులో రెట్టింపుగా మారుతుందని లెక్కగట్టినట్లు వారు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆర్థిక, మహిళా సంక్షేమం, వైద్యం, కార్మిక, స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయాల శాఖల అధికారులు పాల్గొన్నారు.

## హామీల అమలుకు న్యాయపోరాటం



ఇచ్చారు. వైఎస్ఆర్ కడప జిల్లా పులివెందులలో బుధవారం రెండో రోజు ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా జాతీయ రహదారి నిర్మాణంలో ఇళ్లు కోల్పోతున్నామంటూ పరిహారం విషయంలో ప్రభుత్వం స్పందించడం లేదని, పరిహారం ఇప్పించి ఆదుకోవాలని జగన్‌కు రాజారెడ్డి కాలనీ నిర్వాసితులు విన్నవించుకున్నారు. తప్పకుండా న్యాయం ఏం చేస్తామని వారికి జగన్ భరోసా ఇచ్చారు. అంతకు ముందు ఇటీవల మృతి చెందిన లింగాల మండల పరిధిలోని ఇప్పట్ల గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు సుధాకర్‌రెడ్డి కుటుంబ సభ్యులను జగన్ పరామర్శించారు. ఆప్యాయంగా పలకరింపు : జగన్ కలిసేందుకు జిల్లా నలుమూలల నుంచి భారీగా వైసిపి నాయకులు కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు. వ్యక్తిగత సమస్యలను ఆయన దష్టికి తెచ్చారు. ముఖ్యంగా ఆరోగ్యశ్రీ పథకం కింద ఎటువంటి సేవలూ పేదలకు అందలేదని దానివల్ల కార్పొరేట్ హాస్పిటల్‌కి వెళ్లి చూపించుకోవాలంటే చాలా కష్టంగా ఉందని తెలిపారు. దీనికి ఆయన స్పందిస్తూ టిడిపి కూటమి హామీల అమలుపై న్యాయ పోరాటం చేద్దామని అవసరమైతే నిరసనలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని వారికి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కడప ఎంపి వైఎస్ అవినాష్‌రెడ్డి, వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ కుమార్‌రెడ్డి, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి జిల్లాలోని ముఖ్య నాయకులు పాల్గొన్నారు. గురువారం ఉదయం ఎనిమిది గంటలకు హెలికాప్టర్‌లో బెంగళూరు బయలుదేరుతారు.

**జననేతకు ఘన స్వాగతం - పులివెందుల పర్యటనలో ప్రజలతో మమేకమైన వైయస్ జగన్**

వైయస్ఆర్ జిల్లా: వైయస్ఆర్‌సీపీ అధినేత వైయస్ జగన్ మోహన్ రెడ్డి గారు పులివెందుల పర్యటన సందర్భంగా స్థానిక ప్రజలు, పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పర్యటించిన ఆయన, ప్రజల సమస్యలు, అభిప్రాయాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. లింగాల మండలం ఇప్పట్ల గ్రామంలో ఇటీవల వివాహం చేసుకున్న వైయస్ఆర్‌సీపీ నాయకుడు దివంగత పుల్లారెడ్డి కుమారుడు విష్ణువర్ధన్ రెడ్డి -- అమృత రెడ్డి దంపతులను జగన్ ఆశీర్వదించారు. అలాగే అదే గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు వెంకటరామిరెడ్డి నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా పలకరించారు. ఇప్పట్ల శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన వైయస్ జగన్, అనంతరం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మాజీ సర్పంచ్ సుధాకర్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు. ఇదిలా ఉండగా కడప--పార్నపల్లి రహదారిపై రాజారెడ్డి కాలనీకి చెందిన ప్రజలు జగన్‌ను కలిసి తమ సమస్యలను వివరించారు. జాతీయ రహదారి నిర్మాణం కారణంగా తమ ఇళ్లను కోల్పోతున్నామని, సరైన పరిహారం అందడం లేదని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేశారు. వారి సమస్యలను శ్రద్ధగా విన్న వైయస్ జగన్, న్యాయం జరిగేలా పోరాటం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు అన్యాయం జరగనివ్వమని, వారి పక్షాన ఎప్పుడూ నిలబడతామని స్పష్టం చేశారు.

## రాష్ట్రంలో ఎండల తీవ్రత

**(గురువారం) 76 మండలాల్లో తీవ్ర వడగాలులు, మరో 134 మండలాల్లో వడగాలులు ప్రభావం చూపే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు తెలిపారు. ఎల్లుండి ( శుక్రవారం) 51 తీవ్ర, 94 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని వెల్లడించారు.** జాగ్రత్తలు తప్పనిసరి: గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నందున ప్రజలు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. రేపు శ్రీకాకుళం జిల్లాలో 19, విజయనగరం జిల్లాలో 21, పార్వతీపురం మన్యం 3, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 4, పోలవరం 5, విశాఖలో 1, అనకాపల్లిలో 15, కాకినాడ జిల్లాలో 6, తూర్పుగోదావరి జిల్లాలో 2 మండలాల్లో తీవ్ర వడగాలులు ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిపారు. నిన్న వడగండ్ల వాన: ఇదిలా ఉండగా మరోవైపు రాష్ట్రమంతా భానుడి భగభగలతో మండిపోతుంటే అల్లూరి జిల్లా పాడేరును మాత్రం వరుణుడు కరుణించాడు. మంగళవారం ఉదయం అంతా వేడిగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. వడగండ్ల వాన పడింది. ఉదయం నుంచి అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి వేసవి ఉష్ణోగ్రత కలిగి ఉండి మధ్యాహ్నం ఆకస్మికంగా వర్షం పడింది. జి మాడుగుల మండలం లో జి.మాడుగుల, బీరం, మొండికోట ప్రాంతాల్లో వడగండ్ల వాన కురిసింది.

ఒక్కసారిగా ఏజెన్సీ వాతావరణం వర్షాలతో చల్లబడింది. పశ్చిమ బంగాళాఖాతం సమీప ఉత్తరాంధ్ర ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. రానున్న 24 గంటల్లో ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లోని కొన్ని జిల్లాల్లో జల్లులు పడే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో తేలికపాటి గాలులు వీచే అవకాశం ఉన్నట్లు విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ కేవీఎస్ శ్రీనివాస్ తెలిపారు.

## పిఠాపురం వివాదంపై

# సీఎం చంద్రబాబు సీరియస్..

## వర్మ తీరుపై అసంతృప్తి!

- పిఠాపురంలో టీడీపీ, జనసేన నేతల మధ్య ప్రోటోకాల్ వివాదం
- టీడీపీ నేత వర్మ తీరుపై సీఎం చంద్రబాబు తీవ్ర అసంతృప్తి
- టీడీపీ ఏపీ అధ్యక్షుడు పల్లాకు ఫోన్ చేసి కీలక ఆదేశాలు
- బహిరంగ గొడవలు సరికాదని, క్రమశిక్షణ ముఖ్యమని హితవు
- వివాదానికి ఫుల్‌స్టాప్ పెట్టేందుకు రంగంలోకి దిగిన అధిష్ఠానం



అమరావతి,/ శిఖర జనసాక్షి

కాకినాడ జిల్లా పిఠాపురంలో మిత్రపక్షాలైన టీడీపీ, జనసేన నేతల మధ్య చెలరేగిన ప్రోటోకాల్ వివాదంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. ఫ్లెక్సీలో తన ఫొటో లేదన్న కారణంతో మొదలైన ఈ గొడవ, తోపులాట వరకు దారితీయడంపై ఆయన సీరియస్‌గా స్పందించారు. ఇలాంటి ఘటనలు కూటమికి నష్టం కలిగిస్తాయని, పునరావృతం కాకుండా చూడాలని పార్టీ నేతలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

వివరాల్లోకి వెళితే... మంగళవారం పిఠాపురంలో జరిగిన 'పాడా' (పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ) సమావేశం సందర్భంగా ఈ వివాదం రాజుకుంది. కార్యక్రమానికి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఫొటో లేకపోవడంపై టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఎస్వీఎస్ఎన్ వర్మ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమయంలో జనసేన నేత పెండెం దొరబాబు కలుగజేసుకోవడంతో ఇరువురి మధ్య మాటల యుద్ధం మొదలై, తోపులాటకు దారితీసింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో కూటమి శ్రేణుల్లో ఈ వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

ఈ విషయం తన దృష్టికి రావడంతో సీఎం చంద్రబాబు వెంటనే స్పందించినట్లు సమాచారం. టీడీపీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు ఫోన్ చేసి, పిఠాపురం ఘటనపై ఆరా తీశారు. ముఖ్యంగా టీడీపీ నేత వర్మ ప్రవర్తించిన తీరును ఆయన తప్పుబట్టినట్టు తెలిసింది. ఫొటోలు, ప్రోటోకాల్ వంటి చిన్న విషయాల కోసం బహిరంగంగా ఘర్షణలకు దిగడం సరికాదని హితవు పలికినట్టు సమాచారం. ఏవైనా సమస్యలు, పొరపాట్లు ఉంటే వాటిని పార్టీ అధిష్ఠానం లేదా ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకురావాలని, అంతేకానీ వీధుల్లో గొడవపడటం సరైన పద్ధతి కాదని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వంలో పార్టీల మధ్య అంతర్గత క్రమశిక్షణ అత్యంత ముఖ్యమని చంద్రబాబు నొక్కిచెప్పినట్లు తెలుస్తోంది. ఈ విషయంలో ఎస్వీఎస్ఎన్ వర్మకు స్పష్టమైన సూచనలు ఇవ్వాలని పల్లా శ్రీనివాసరావును ఆయన ఆదేశించారు. మరోవైపు ఈ ఘటన తర్వాత సోషల్ మీడియాలో టీడీపీ, జనసేన కార్యకర్తల మధ్య మాటల యుద్ధం మొదలైంది. దీంతో వివాదం మరింత ముదరకముందే దానికి ఫుల్‌స్టాప్ పెట్టాలనే ఉద్దేశంతో అధిష్ఠానం రంగంలోకి దిగినట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.



## ఇసెట్‌కు ఏర్పాట్లు పూర్తి


### ఉన్నత విద్యామండలి కార్యదర్శి తిరుపతిరావు

అమరావతి,/ శిఖర జనసాక్షి

డిప్లమో, డిగ్రీ పూర్తిచేసిన విద్యార్థులు ఇంజినీరింగ్ రెండో సంవత్సరంలో ప్రవేశం పొందేందుకు నిర్వహించే ఇసెట్-2026 పరీక్ష గురువారం జరగనుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తిచేసినట్లు ఉన్నత విద్యామండలి కార్యదర్శి తిరుపతిరావు బుధవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 33,751 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని, ఎపి, తెలంగాణలో వీరికోసం 95 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు రెండో సెషన్ పరీక్ష ఉంటుందని తెలిపారు. నిర్ణీత సమయం తరువాత నిమిషం ఆలస్యమైనా.. పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఉండదని పేర్కొన్నారు.

## అధిక పని గంటలపై పిల్

### కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసులు





అమరావతి,/ శిఖర జనసాక్షి

ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనాస్పత్రుల్లో పిజి మెడికల్ విద్యార్థులకు నిర్దేశించిన పని గంటలు మాత్రమే విధులు నిర్వహించేలా ఉత్తర్వులివ్వాలంటూ దాఖలైన పిల్‌ను హైకోర్టు బుధవారం విచారించింది. వైద్య విద్యార్థులు నిర్దేశిత పని గంటలకు మించి విధులు నిర్వర్తిస్తున్నారని, అత్యవసర పరిస్థితుల్లో మినహా మిగిలిన సమయాల్లో 8 గంటలే పనిచేసేలా ఉత్తర్వులివ్వాలన్న పిల్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. కౌంటర్లు దాఖలు చేయాలని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కార్యదర్శి, నేషనల్ మెడికల్ కమిషన్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, వైద్య విద్య డైరెక్టర్, ఎన్‌టిఆర్ హెల్త్ వర్సిటీలను ఆదేశించింది. విచారణను జూన్ 17కు వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన బెంచ్ ఆదేశించింది. గుంటూరుకు చెందిన ప్రముఖ వైద్యుడు ఆళ్ల వెంకటేశ్వర్లు ఈ పిల్ దాఖలు చేశారు. పిజి వైద్యులు 36 గంటలు కూడా పనిచేస్తున్నారని న్యాయవాది లకీ హరీష్ తెలిపారు. 12 గంటలు మించి పనిచేయడానికి వీల్లేదన్నారు.

## యాత్రికులకు మెరుగైన వసతులు: టిటిడి ఇఒ రవిచంద్ర

తిరుపతి / శిఖర జనసాక్షి

శ్రీవారి దర్శనార్థం తిరుమల, తిరుపతికి వచ్చే యాత్రికులకు మరింత మెరుగైన వసతులు కల్పించేందుకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని టిటిడి ఇఒ ఎం రవిచంద్ర అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని టిటిడి పరిపాలన భవనంలో బుధవారం జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ప్రతిరోజూ వేలాదిగా వచ్చే యాత్రికులకు ప్రస్తుత వసతి సదుపాయాలు సరిపోవడంలేదని, వాటిని విస్తరించేందుకు సమగ్ర అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని సూచించారు. వేసవి తీవ్రతను దష్టిలో ఉంచుకుని తిరుమలలో మాడవీధులు, ఆలయ పరిసరాలు, ముఖ్య ప్రదేశాల్లో నిరంతరం నీటి పిచికారీ చేయాలని ఆదేశించారు. యాత్రికుల నుండి అభిప్రాయాలు సేకరించి, వాటి ఆధారంగా సేవలను మరింత మెరుగుపరచాలని సూచించారు. అన్ని ఆలయాల్లో క్యూఆర్ కోడ్ ద్వారా అభిప్రాయ సేకరణ చేపట్టాలని సూచించారు. శ్రీవారి సేవ వ్యవస్థను మరింత బలోపేతం చేసి, ఇతర ఆలయాలకు



విస్తరించేలా చర్యలు తీసుకోవాలని సిపిఆర్ఓ డాక్టర్ టి రవికి ఆదేశించారు. ఈ సమావేశంలో టిటిడి కల్యాణ మండపాల నిర్వహణ, ఎస్‌విబిసి, స్విమ్స్, ఎఫ్ఎంఎస్, వసతి గృహాలు, ఎస్ఎస్‌డి, ఎస్ఇడి, శ్రీవాణి దర్శనం టికెట్ల జారీ తదితర అంశాలపై చర్చించారు. టిటిడి అదనపు ఇఒ సిహెచ్ వెంకయ్య చౌదరి, జెఇఒలు వి వీరబ్రహ్మం, డాక్టర్ ఎం శరత్, సివిఎస్ఓ కెవి మురళీకృష్ణ, సిఇ టివి సత్యనారాయణ, అడిషనల్ ఎఫ్ఎసిఎఒ రవిప్రసాద్, ఇంఛార్జి లా ఆఫీసర్ వెంకట సుబ్బానాయుడు పాల్గొన్నారు.

## దస్తగిరి హత్య ఆస్తుల తగాదాగా చిత్రీకరిస్తున్నారు : మంత్రి సవిత



అమరావతి,/ శిఖర జనసాక్షి

కడప జిల్లాలో దస్తగిరి హత్యను ఆస్తుల తగాదాగా చిత్రీకరించి డైవర్ట్ చేయాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చూస్తున్నారని బిసి సంక్షేమశాఖ మంత్రి సవిత ఆరోపించారు. తమ ప్రభుత్వం, పోలీసులు చాలా అప్రమత్తంగా ఉన్నారని, నేరస్తులు ఎక్కడ దాక్కున్నా, ఎవరి వెనుక ఉన్నా పట్టుకుని తీరుతామని హెచ్చరించారు. టిడిపి కార్యాలయంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. కులాలు, ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టి శవ రాజకీయం చేయడం జగన్‌కు వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. జగన్‌కు అత్యంత సన్నిహితుడిగా, బినామీగా ఉన్న బిసికి చెందిన దస్తగిరిని స్వార్ధ ప్రయోజనాల కోసం బలి తీసుకున్నారని ఆరోపించారు. ఈ హత్య కేసులో ఇప్పటికే 11 మందిని లోపలికి పంపించామని, నిత్యానందరెడ్డితో పాటు ఇందులో భాగస్వాములైన ప్రతి ఒక్కరినీ అరెస్టు చేస్తామని తెలిపారు. దస్తగిరి వెనకేసిన వందల కోట్ల అక్రమ ఆస్తుల వెనుక ఉన్న అసలు సూత్రధారులను త్వరలోనే బయటపెడతామని వెల్లడించారు.

**కోడ్ ఉల్లంఘించినందుకే వెంకట్రామిరెడ్డి తొలగింపు : అశోక్‌బాబు**

ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించినందుకే కాకర్ల వెంకంంట్రామిరెడ్డిని వైఎస్ జగన్ ప్రభుత్వంలోనే సస్పెండ్ చేశారని టిడిపి ప్రధాన కార్యదర్శి పి అశోక్‌బాబు అన్నారు. 2024 ఫిబ్రవరి 2న ఎన్నికల కోడ్ ఉన్నా వెంకట్రామిరెడ్డి, చల్లా చంద్రయ్య వైసిపి జెండాలు పట్టుకొని కడప జిల్లాలోని నాలుగు ఆర్‌టిసి డిపోల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారని తెలిపారు. దీనిపై టిడిపి ఎక్కడా ఫిర్యాదు చేయలేదని, బద్వేల్ రిటర్నింగ్ అధికారి ఫిర్యాదు చేశారని వెల్లడించారు. వెంకట్రామిరెడ్డి ఒక్కడే రాష్ట్ర ఉద్యోగినా అని ప్రశ్నించారు. రామకృష్ణతో పాటు ఆర్థిక శాఖలో చాలా మందిని సస్పెండ్ చేశారని, ఆలిండియా సర్వీస్ అధికారులు ఎబి వెంకటేశ్వరరావు, ఎల్‌వి సుబ్రహ్మణ్యంను వైసిపి హయాంలో ఇబ్బందులకు గురి చేశారని తెలిపారు.

## కెసిఆర్, హరీష్ రావుకు కోర్టులో ఊరట

హైదరాబాద్,/ శిఖర జనసాక్షి





తెలంగాణ : బిఆర్ఎస్ అధినేత కెసిఆర్, మాజీ మంత్రి హరీష్ రావుకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై విచారణ కోసం ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ రిపోర్టును హైకోర్టు నిలిపివేసింది. రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఆదేశించింది. కమిషన్ ఎలాంటి నిబంధనలు పాటించలేదని కోర్టు పేర్కొంది. ఇదే సమయంలో కమిషన్ నియామకం చట్టబద్ధమే అని స్పష్టం చేసింది. కాగా, ఘోష్ కమిషన్‌పై దాఖలైన పిటిషన్‌లపై బుధవారం విచారణ సందర్భంగా హైకోర్టు తీర్పు వెలువరించింది. అయితే, కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో విచారణ జరిపిన జస్టిస్ ఘోష్ కమిషన్‌పై దాఖలైన పిటిషన్‌లపై తుది తీర్పు వాయిదా పడిన విషయం తెలిసిందే. మెగా ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం, నిర్వహణల్లో అవకతవకలపై విచారణ నిమిత్తం తెలంగాణ ప్రభుత్వం జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఏర్పాటు చేసింది. దీన్ని సవాలు చేస్తూ బిఆర్ఎస్ అధినేత.. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు, ఐఎఎస్ అధికారిణి స్మితా సభర్వాల్, ఐఎఎస్ మాజీ అధికారి ఎస్.కె.జోషిలు విడివిడిగా పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం సుదీర్ఘ విచారణ చేపట్టి ఈనెల 22వ తేదీకి వాయిదా వేసింది ధర్మాసనం. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో అవకతవకలు జరిగాయంటూ.. జస్టిస్ పి.సి.ఘోష్ కమిషన్‌ను నియమిస్తూ తెలంగాణ ప్రభుత్వం 2024 మార్చి 14న జీవో 6ను జారీ చేసింది. కమిషన్ చేపట్టిన విచారణ ప్రక్రియలో ఉల్లంఘనలు జరిగాయని, అభియోగాలు మోపే ముందు తమ వాదనను పరిగణనలోకి తీసుకోలేదని పిటిషనర్లు పేర్కొన్నారు. విస్తృత ప్రజాప్రయోజనాల దృష్ట్యా కమిషన్ వేశామంటూ మరొకరి పరువు ప్రతిష్ఠలు దెబ్బతీయడం సరికాదన్నారు. మరోవైపు ప్రభుత్వం తరపు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ... ప్రజాప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని కమిషన్ వేసినట్లు తెలిపారు. జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదిక రికార్డుల ఆధారంగానే ఇచ్చిందన్నారు. ఇందులో భాగంగా పిటిషనర్లతోపాటు పలువురికి నోటీసులు ఇచ్చి విచారణ చేపట్టిందని.. కాబట్టి పిటిషన్‌లను కొట్టివేయాలని కోరారు.



# కానిస్టేబుల్ ఉద్యోగం వద్దనుకుని క్రికెటర్ అయ్యాడు..

## మరి ఈ రోజు వైభవ్ సిక్సర్ల సునామీకి బ్రేకులు వేస్తాడా?

**లక్నో సూపర్ జెయింట్స్ (LSG), రాజస్థాన్ రాయల్స్ (RR) మధ్య జరగబోయే 32వ మ్యాచ్ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఈ మ్యాచ్‌లో అందరి కళ్లు ఇద్దరు యువ సంచలనాల మీద ఉన్నాయి. ఒకరు రాజస్థాన్ రాయల్స్ సిక్సర్ల వీరుడు వైభవ్ సూర్యవంశీ, మరొకరు లక్నో సూపర్ జెయింట్స్ స్పీడ్ గన్ ప్రిన్స్ యాదవ్.**




ఐపీఎల్ 2026 సీజన్‌లో కుర్రాళ్ల హవా కొనసాగుతోంది. ముఖ్యంగా లక్నో సూపర్ జెయింట్స్ (LSG), రాజస్థాన్ రాయల్స్ (RR) మధ్య జరగబోయే 32వ మ్యాచ్ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఈ మ్యాచ్‌లో అందరి కళ్లు ఇద్దరు యువ సంచలనాల మీద ఉన్నాయి. ఒకరు రాజస్థాన్ రాయల్స్ సిక్సర్ల వీరుడు వైభవ్ సూర్యవంశీ, మరొకరు లక్నో సూపర్ జెయింట్స్ స్పీడ్ గన్ ప్రిన్స్ యాదవ్. ఈ ఇద్దరి మధ్య జరిగే పోరు మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేసే అవకాశం ఉంది.

రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడుతున్న 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ గురించి ఇప్పుడు ప్రపంచమంతా మాట్లాడుకుంటోంది. బుమ్రా, బౌల్ట్ వంటి దిగ్గజ బౌలర్లనే చీల్చిచెండాడిన ఈ కుర్రాడు, తన ఐపీఎల్ కెరీర్‌లో ఇప్పటికే 44 సిక్సర్లు బాదాడు. క్రీజులోకి వచ్చిన మొదటి బంతినే సిక్సర్‌గా మలచడం ఇతడికి వెన్నతో పెట్టిన విద్య. ఏ బౌలర్ వచ్చినా తగ్గేదేలే అంటూ విరుచుకుపడుతున్న వైభవ్‌కు ఇప్పుడు ప్రిన్స్ యాదవ్ రూపంలో ఒక పెద్ద సవాల్ ఎదురుకానుంది.

లక్నో సూపర్ జెయింట్స్ పేసర్ ప్రిన్స్ యాదవ్ కథ సినిమాను తలపిస్తుంది. ఇతడి తండ్రి రైల్వే పోలీసులో ఏఎస్ఐగా పనిచేస్తున్నారు. తన కొడుకును కానిస్టేబుల్ పరీక్ష రాయమని తండ్రి చెబితే.. తన మీద నమ్మకంతో క్రికెట్‌నే కెరీర్‌గా ఎంచుకున్నాడు ప్రిన్స్. అయితే వయస్సు వివాదంలో చిక్కుకుని రెండేళ్ల పాటు నిషేధాన్ని ఎదుర్కొన్నాడు. లాక్ డౌన్ సమయంలో ఇంట్లోనే కష్టపడి తన వేగాన్ని, స్వింగ్‌ను మెరుగుపరుచుకున్నాడు. నిషేధం ముగిసిన తర్వాత ఐపీఎల్ 2026లో తన ప్రతాపం చూపిస్తున్నాడు.

సౌతాఫ్రికా దిగ్గజం డేల్ స్టెయిన్ సైతం ప్రిన్స్ యాదవ్ బౌలింగ్‌కు ఫిదా అయ్యాడు. ఈ సీజన్ ఆడుతున్న అన్‌క్యాప్డ్ బౌలర్లందరిలోనూ ప్రిన్స్ యాదవ్ అత్యంత అత్యుత్తమ బౌలర్ అని, అతడిని నంబర్ వన్ స్థానంలో ఉంచాడు స్టెయిన్. ఇప్పటికే ఆరు మ్యాచుల్లో 11 వికెట్లు పడగొట్టి పర్పుల్ క్యాప్ రేసులో నిలిచిన ప్రిన్స్, ఇప్పుడు వైభవ్ సూర్యవంశీని కట్టడి చేయడానికి సిద్ధంగా ఉన్నాడు.

ఒకవైపు సిక్సర్ల వీరుడు వైభవ్, మరోవైపు వేగంతో వికెట్లు పడగొట్టే ప్రిన్స్ యాదవ్. లక్నో, రాజస్థాన్ మ్యాచ్‌లో ఈ ఇద్దరి మధ్య జరిగే పోరు ఎంతో ఉత్కంఠను రేపుతోంది. ప్రిన్స్ తన పదునైన యార్కర్లతో వైభవ్‌ను ఇబ్బంది పెడతాడా? లేక వైభవ్ తన ట్రేడ్‌మార్క్ సిక్సర్లతో ప్రిన్స్‌ను చితక్కొడతాడా? అన్నది తేలాల్సి ఉంది. ఈ ఇద్దరిలో ఎవరు పైచేయి సాధిస్తే ఆ జట్టుకే గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

# లక్నోపై రాజస్థాన్ ఘన విజయం..

## పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి 'రాయల్స్'



రాజస్థాన్ రాయల్స్ చేతిలో లక్నో సూపర్ జెయింట్స్ తన సొంత మైదానంలో ఓటమి చవిచూసింది. ఐపీఎల్ 2026లో భాగంగా లక్నోలోని భారతరత్న శ్రీ అటల్ బిహారీ వాజపేయి ఏక్నా క్రికెట్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ 40 పరుగుల తేడాతో భారీ విజయం సాధించింది. రాజస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 159 పరుగులు చేయగా, 160 పరుగుల లక్ష్యంతో క్రీజులోకి దిగిన లక్నో 18 ఓవర్లలో 119 పరుగులకే ఆలౌట్ అయింది. లక్నో చివరలో 15 పరుగుల తేడాలో ఐదు వికెట్లను కోల్పోయింది. లక్నో సూపర్ జెయింట్స్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ రాయల్స్ 159 పరుగులు చేసింది. చివరి ఓవర్‌లో లక్నో బౌలర్ మయాంక్ అగర్వాల్ ఏకంగా 20 పరుగులు ఇచ్చాడు. దీనితో రాజస్థాన్ స్కోర్ 150 దాటింది. ప్రారంభంలో దూకుడు మీదున్న జైశ్వాల్‌ను మహమ్మద్ షమీ పెవిలియన్‌కు పంపించాడు. మూడో ఓవర్ వేసిన షమీ వరుస బంతుల్లో జైశ్వాల్, ధ్రువ్ జురెల్‌లను ఔట్ చేశాడు. దీంతో రాజస్థాన్ ఆట నెమ్మదించింది. షమీ, ప్రిన్స్ యాదవ్, మోహ్సిన్ ఖాన్ తలా రెండు వికెట్లు తీశారు. రాజస్థాన్ ఆటగాళ్లలో రవీంద్ర జడేజా (43), జైస్వాల్ (22), హెట్మెయర్ (22) శివమ్ దుబే (19) పరుగులు చేశారు. ఆ తర్వాత ఛేదన ప్రారంభించిన లక్నో మొదటి రెండు ఓవర్లలోనే కీలక రెండు వికెట్లను కోల్పోయింది. నాంద్రే బర్గర్ బౌలింగ్‌లో రిషబ్ పంత్ డకౌట్‌గా వెనుదిరిగాడు. లక్నో ఆటగాళ్లలో మిచెల్ మార్ష్ 41 బంతుల్లో 55 పరుగులు చేసి రాణించాడు. మిగిలిన వారు ఎవరూ ఉత్తమ ప్రదర్శన కనబరచలేదు. జోఫ్రా ఆర్చర్ 3, బ్రిజేష్ శర్మ, నాంద్రే బర్గర్ రెండేసి వికెట్ల చొప్పున తీసుకున్నారు. పంజాబ్ కింగ్స్ ఆరు మ్యాచ్‌లకు గాను ఐదింట గెలిచి 11 పాయింట్లతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉంది. ఇప్పటి వరకు 4 పాయింట్లతో బెంగళూరు, హైదరాబాద్, రాజస్థాన్ రెండు, మూడు, నాలుగో స్థానాల్లో ఉన్నాయి. లక్నోపై విజయం సాధించడంతో మొత్తం పది పాయింట్లు సాధించిన రాజస్థాన్ పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి ఎగబాకింది.

# గోవా వేదికగా శాఫ్ మహిళల ఛాంపియన్‌షిప్



గోవా: శాఫ్ మహిళల ఛాంపియన్‌షిప్‌కు భారత్ ఆతిథ్యమివ్వనుంది. మే 24నుంచి జూన్ 7వరకు గోవా వేదికగా జరిగే శాఫ్ మహిళల ఛాంపియన్‌షిప్‌లో భారత్‌తోపాటు డిఫెండింగ్ ఛాంపియన్ బంగ్లాదేశ్, మాల్దీవులు కూడా బరిలో దిగనున్నాయి. 'గోవాలో శాఫ్ ఛాంపియన్‌షిప్ పోటీలు జరగనున్న క్రమంలో ఆలిండియా ఫుటల్‌బాల్ ఫెడరేషన్ దక్షిణ ఆసియా ఫుటబాల్ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ పురుషోత్తం కట్టెల్ బుధవారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. ఫటోర్డాలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఆరుజట్ల మధ్య టైటిల్ సంగ్రామం జరగనుంది. ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన భారత్‌కు దశాబ్దకాలం తర్వాత మరోసారి ఆతిథ్య హక్కులు దక్కాయి. భారత్ శాఫ్ టోర్నీ జరగనున్న క్రమంలో పాకిస్తాన్ మహిళలజట్టు టోర్నీనుంచి వైదొలిగింది. రెండు గ్రూపులో టాప్-2లో నిలిచిన జట్లు సెమీస్‌లో తలపడతాయి. సెమీస్‌లో గెలిచిన రెండుజట్ల మధ్య టైటిల్ సంగ్రామం జరగనుంది. గత రెండు ఎడిషన్‌లలో భారతజట్టు అద్భుత ప్రతిభను కనబర్చింది. 2022, 2024లలో బంగ్లాదేశ్, నేపాల్ జట్ల చేతిలో ఫైనల్లో ఓడి రన్నరప్‌గా నిలిచింది. 2019 ఫైనల్లో ఆతిథ్య నేపాల్‌పై భారత మహిళలజట్టు 3-1 గోల్స్ తేడాతో ఓడించి చివరిసారిగా టైటిల్‌ను కైవసం చేసుకుంది.

**గ్రూప్‌లు...**

గ్రూప్-ఎ: నేపాల్, శ్రీలంక, భూటాన్


గ్రూప్-బి: ఇండియా, బంగ్లాదేశ్, మాల్దీవులు

# పరిపక్వత లేకపోతే అభిషేక్ నంబర్‌వన్ ఎలా అవుతాడు?: వరుణ్ ఆరోన్

**దిల్లీ క్యాపిటల్స్‌పై చివరి వరకూ క్రీజ్‌లో ఉన్న అభిషేక్ శర్మ అజేయశతకంతో అదరగొట్టాడు. సన్‌రైజర్స్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. అంతకుముందు దూకుడుగా ఆడే క్రమంలో అనవసరమైన షాట్లు కొట్టి పెవిలియన్‌కు చేరేవాడు. దీంతో అతడి పరిపక్వతపై సోషల్ మీడియా వేదికగా కామెంట్లూ వచ్చాయి. అయితే, ఈ విషయంలో అభిషేక్‌ను హైదరాబాద్ బౌలింగ్ కోచ్ వరుణ్ ఆరోన్ వెనుకేసుకొచ్చాడు. అతడు ఫామ్‌ను కోల్పోయిన సమయంలోనూ అతడి పరిణతిలోపాన్ని ప్రశ్నించలేమని వరుణ్ వ్యాఖ్యానించాడు.**

### తమ్ముడు హార్దిక్‌తో విభేదాలు.. స్పందించిన కృనాల్ పాండ్య

"అభిషేక్ శర్మ ఎప్పుడూ పరిణతితోనే ఉంటాడు. గత కొన్నేళ్లుగా అతడి ఆటతీరు ఇలానే ఉంది. ఆ పరిపక్వత లేకపోతే ప్రపంచంలోనే నంబర్ వన్ టీ20 ప్లేయర్‌గా ఎదగగలడా? ప్రత్యర్థినిబట్టి, పిచ్‌నుబట్టి ఎలా ఆడాలో నిర్ణయించుకుంటాడు. అందుకు ఈ మ్యాచ్‌నే చూడాలి. ఈ పిచ్ తొలుత బ్యాటింగ్‌కు కాస్త కష్టంగా మారింది. ప్రతి బంతిని ఆచితూచి ఆడాడు. ఇక్కడ ప్రత్యర్థిని గౌరవించాడు. గతంలోనూ ఇలానే వ్యవహరించాడు. అయితే, హైరిస్క్ గేమ్‌లో ఒక్కోసారి వర్కౌట్ కాకపోవచ్చు. అందుకే, వెసులుబాటు ఇస్తుండాలి. ప్రతి



మ్యాచ్‌లోనూ వంద శాతం డెడికేషన్‌తో ఆడినా ఫలితం ఒక్కోసారి అనుకూలంగా రాకపోవచ్చు" అని వరుణ్ ఆరోన్ వెల్లడించాడు.

### మా బౌలర్లు టాలెంటెడ్..

"ఇతర బౌలర్లతో పోలిస్తే మా కుర్రాళ్ల నైపుణ్యం ఏమాత్రం తగ్గదు. మలింగను తీసుకుంటే బంతిని రివర్స్ చేస్తాడు. ఇది ప్రత్యర్థి బ్యాటర్లకు చాలా కష్టం. ఇక సకిబ్ 140కి.మీ వేగంతో నిలకడగా బౌలింగ్ చేస్తాడు. స్లో బంతులనూ అద్భుతంగా సంధించగల బౌలర్. ఈ సీజన్‌లో మా ప్రణాళిక ఒక్కటే. పిచ్‌తో సంబంధం లేకుండా అద్భుతమైన బౌలింగ్ రాబట్టాలి. ఇప్పటికే సకిబ్, మలింగ సాధించారు. గత రెండేళ్లుగా సకిబ్‌ను చూస్తున్నా. ఉప్పల్ పిచ్‌పై బ్యాటర్లను ఇబ్బంది పెట్టడం చూస్తుంటే ముచ్చటేస్తోంది" అని ఆరోన్ తెలిపాడు.

# వారణాసిలో కాబోయే భార్య ఎంపీ ప్రియా సరోజ్‌తో రింకూ సింగ్ సందడి..

## పెళ్లి ముహూర్తం ఖరారు ?



**భారత క్రికెట్ సంచలనం, కోల్‌కతా నైట్ రైడర్స్ స్టార్ బ్యాటర్ రింకూ సింగ్ త్వరలోనే ఓ ఇంటివాడు కాబోతున్నాడు. తనకు కాబోయే భార్య, సమాజ్ వాదీ పార్టీ ఎంపీ ప్రియా సరోజ్‌తో కలిసి ఆయన పవిత్ర కాశీ పుణ్యక్షేత్రాన్ని సందర్శించడం ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఐపీఎల్ 2026 సీజన్ మధ్యలో లభించిన విరామంలో ఈ జంట బాబా విశ్వనాథుని ఆశీస్సులు తీసుకోవడం, వారి పెళ్లికి సంబంధించిన వార్తలకు మరింత బలం చేకూర్చింది.**

కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు ప్రస్తుతం ఐపీఎల్ 2026లో బిజీగా ఉన్నప్పటికీ, తన జట్టు తర్వాతి మ్యాచ్ లక్నోలో జరగాల్సి ఉండటంతో రింకూ సింగ్ చిన్న బ్రేక్ తీసుకున్నాడు. ఏప్రిల్ 21న తన కాబోయే భార్య ప్రియా సరోజ్‌తో కలిసి వారణాసి చేరుకున్నాడు. వీరిద్దరూ కలిసి కాశీ విశ్వనాథ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దశాశ్వమేధ ఘాట్‌లో జరిగిన గంగా హారతిలో పాల్గొని ఆధ్యాత్మిక అనుభూతిని పొందారు. "కాశీ.. మహాదేవుని నేల, గంగమ్మ పవిత్ర సంగమం" అంటూ ఇన్ స్టాగ్రామ్‌లో ఫోటోలను షేర్ చేశారు.

### పెళ్లి ఎక్కడ? ఎప్పుడు?

తాజా సమాచారం ప్రకారం.. రింకూ సింగ్ -- ప్రియా సరోజ్ వివాహం జూన్ మొదటి వారంలో జరిగే అవకాశం ఉంది. ఈ వేడుకకు వారణాసిలోని అత్యంత విలాసవంతమైన హోటల్ తాజ్ వేదిక కాబోతోందని వార్తలు వస్తున్నాయి. వీరు కాశీ పర్యటనలో భాగంగా అదే హోటల్‌లో బస చేయడం, అక్కడి ఏర్పాట్లను పర్యవేక్షించడం చూస్తుంటే డెస్టినేషన్ వెడ్డింగ్ పక్కా అని అభిమానులు భావిస్తున్నారు. దేవ దీపావళి వేడుకలకు కూడా ఈ జంటను వారణాసి నిర్వాహకులు ఆహ్వానించారు.

### ప్రియా గురించి ఆసక్తికర విషయాలు

రింకూ సింగ్ మనసు గెలుచుకున్న ప్రియా సరోజ్ సాధారణ వ్యక్తి కాదు. ఆమె ఉత్తరప్రదేశ్‌లోని మచ్లిషహర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి సమాజ్‌వాదీ పార్టీ తరఫున గెలిచిన ఎంపీ. రాజకీయాల్లో చురుగ్గా ఉంటూనే, క్రికెట్ స్టార్ రింకూతో ఆమె గత కొంతకాలంగా ప్రేమలో ఉన్నారు. వీరిద్దరికీ ఇప్పటికే నిశ్చితార్థం ముగియగా, ఇప్పుడు అధికారికంగా పెళ్లి పీటలు ఎక్కబోతున్నారు.


### క్రికెట్ కెరీర్, ఐపీఎల్

ప్రస్తుతం రింకూ సింగ్ కేకేఆర్ జట్టుకు వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ సీజన్‌లో కేకేఆర్ ప్రస్థానం కాస్త నెమ్మదిగా సాగుతున్నప్పటికీ, ఏడో మ్యాచ్‌లో తొలి విజయం అందుకోవడంతో జట్టులో ఉత్సాహం పెరిగింది. టీమిండియా తరఫున కూడా రింకూ సింగ్ అద్భుతమైన ఫినిషర్‌గా పేరు తెచ్చుకున్నారు. 45 టీ20లు, 2 వన్డేలు ఆడిన రింకూ, తన పవర్‌ఫుల్ హిట్టింగ్‌తో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్నారు. ఇప్పుడు తన వ్యక్తిగత జీవితంలో కొత్త ఇన్నింగ్స్ ప్రారంభించడానికి సిద్ధమవుతున్నారు.

# నాడు 715 సిక్సర్లతో బీభత్సం..

## నేడు ఒక్క పరుగు చేయలేని దీనస్థితి..

**ప్రపంచ టీ20 క్రికెట్‌లో సిక్సర్ల సునామీ సృష్టించే కరీబియన్ వీరుడు నికోలస్ పూరన్, ప్రస్తుత ఐపీఎల్ 2026 సీజన్‌లో పరుగుల వేటలో తీవ్రంగా తడబడుతున్నాడు. తన కెరీర్‌లో వందల కొద్దీ భారీ సిక్సర్లతో ప్రత్యర్థి బౌలర్లను భయపెట్టిన ఈ విధ్వంసకర బ్యాటర్, ఇప్పుడు ఒక్కో పరుగు కోసం నానా ఇబ్బందులు పడుతుండటం గమనార్హం. లక్నో సూపర్ జెయింట్స్ జట్టుకు అతను ఇప్పుడు భారంగా మారాడనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.**





నికోలస్ పూరన్ అంటేనే మైదానంలో సిక్సర్ల వర్షం. తన సుదీర్ఘ టీ20 కెరీర్‌లో 449 మ్యాచ్‌లు ఆడిన పూరన్, ఏకంగా 715 సిక్సర్లు బాదాడు. 147.32 స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేసే ఈ మొనగాడు, క్రీజులోకి వస్తే మ్యాచ్ ఫలితం తలకిందులు కావాల్సిందే. మొత్తం 10,422 పరుగుల భారీ రికార్డు ఉన్నప్పటికీ, ఐపీఎల్ 2026లో మాత్రం అతని మ్యాజిక్ పూర్తిగా మాయమైనట్లు కనిపిస్తోంది. పవర్‌ఫుల్ హిట్టర్‌గా పేరున్న పూరన్, ప్రస్తుత సీజన్‌లో తన నీడలా కూడా ఆడలేకపోతున్నాడు.

ఈ సీజన్‌లో ఇప్పటివరకు 6 మ్యాచ్‌లు ఆడిన పూరన్, కేవలం 8.50 సగటుతో 51 పరుగులు మాత్రమే చేయగలిగాడు. అత్యధిక స్కోరు కేవలం 19 పరుగులు మాత్రమే కావడం అతని ఫామ్ ఎంత దారుణంగా ఉందో స్పష్టం చేస్తోంది. ఎప్పుడూ 150కి పైగా స్ట్రైక్ రేట్‌తో ఆడే పూరన్, ఈ ఏడాది కేవలం 79.69 వేగంతో పరుగులు చేస్తున్నాడు. ఇది ఒక విధ్వంసకర బ్యాటర్‌కు ఉండాల్సిన వేగం కాదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. గత సీజన్‌లో ఆకాశమే హద్దుగా చెలరేగిన ఈ బ్యాటర్, ఇప్పుడు 6 మ్యాచ్‌లలో కేవలం 3 సిక్సర్లు, 2 ఫోర్లు మాత్రమే కొట్టడం గమనార్హం.

2025 ఐపీఎల్ సీజన్‌లో పూరన్ ఒక సంచలనం. ఆ ఏడాది 14 మ్యాచ్‌లలో 43.67 సగటుతో 524 పరుగులు చేశాడు. అప్పట్లో అతని స్ట్రైక్ రేట్ 196.25గా ఉండటంతో పాటు, ఏకంగా 40 సిక్సర్లు బాదాడు. ఆ ప్రదర్శన చూసి లక్నో యాజమాన్యం అతనిపై ఎన్నో ఆశలు పెట్టుకుని భారీ ధరకు అట్టిపెట్టుకుంది. కానీ, ఏడాది తిరిగేసరికి పరిస్థితి పూర్తిగా మారిపోయింది. గతంలో తాను సృష్టించిన రికార్డులకు భిన్నంగా, ఇప్పుడు జట్టుకు ఉపయోగపడని ఆటగాడిగా విమర్శలపాలవుతున్నాడు.

ఓవరాల్‌గా ఈ మెగా లీగ్ చరిత్రను పరిశీలిస్తే, పూరన్ ఇప్పటివరకు 96 మ్యాచ్‌లలో 32.10 సగటుతో 2344 పరుగులు చేశాడు. ఇందులో 14 అర్ధ సెంచరీలు ఉన్నాయి. మొత్తం మీద 164.95 స్ట్రైక్ రేట్‌తో ఆడే పూరన్, తన స్థాయికి తగ్గట్టుగా పుంజుకోవాలని జట్టు యాజమాన్యం కోరుకుంటోంది. లక్నో జట్టు ప్లేఆఫ్స్ ఆశలు సజీవంగా ఉండాలంటే, ఈ కరీబియన్ హిట్టర్ తన పాత ఫామ్‌ను అందిపుచ్చుకోవడం అత్యంత కీలకం.

# ఐసిసి పదవికి వాసిం ఖాన్ గుడ్ బై



లాహోర్: పాకిస్థాన్ మాజీ సిఇఒ వాసిమ్ ఖాన్ అంతర్జాతీయ క్రికెట్ కమిటీలో జనరల్ మేనేజర్ పదవికి గుడ్ బై చెప్పాడు. నాలుగేళ్లుగా ఆ బాధ్యతల్లో కొనసాగుతున్న వాసిం ఖాన్ జెఫ్ అల్లార్డైస్ నుంచి 2022లో బాధ్యతలను స్వీకరించారు. దీనికి ముందు వాసిం ఖాన్ పిసిబి సిఇఒగా మూడేళ్లు పనిచేశాడు. తాజాగా ఐసిసి జనరల్ మేనేజర్ పదవిని నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించినా.. ఐసిసి మరో బాధ్యతలను అందుకునే అవకాశం ఉంది. గత రెండేళ్లుగా ఐసిసిలో భారీ మార్పులు చోటు చేసుకుంటున్న సంగతి తెలిసిందే. అమిత్ షా కుమారుడు జై షా ఐసిసి అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత అత్యున్నత స్థాయిలో ఉండే వ్యక్తులు తమ పదవులను వదిలేశారు. అల్లార్డైస్‌తోపాటు యాంటీ కరప్షన్ యూనిట్‌కు చెందిన క్రిస్ టెట్లీ, అలెక్స్ మార్షల్ వైదొలిగారు. వారి స్థానంలో గౌరవ్ సక్సేనా, ఆండ్రూ వచ్చి చేరారు. ఇప్పుడు వాసిమ్‌ఖాన్ తన పదవికి రాజీనామా చేశారు. పాక్ క్రికెట్ బోర్డులో కీలక బాధ్యతలు చేపట్టిన వాసిమ్ ఇంగ్లాండ్‌లో జన్మించడం విశేషం. అక్కడే తన క్రికెట్ కెరీర్‌ను మొదలుపెట్టారు. పాక్ మూలాలు ఉన్నప్పటికీ.. ఈ జట్టు తరఫున ఒక్క మ్యాచూ ఆడలేదు. కానీ, పీసీబీకి సీఈవోగా పనిచేశారు.

# ఎంఆర్‌పి టీజర్ విడుదల

## నిర్మాత సాహు గారపాటి చేతుల మీదుగా ఆవిష్కరణ




హైదరాబాద్ : ఎంఆర్పీ సినిమా టీజర్ విడుదలై ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని రేకెత్తిస్తోంది. ప్రముఖ నిర్మాత సాహు గారపాటి చేతుల మీదుగా ఈ టీజర్ విడుదల కావడం చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా మారింది. టీజర్ విడుదల చేసిన అనంతరం టీం అందరికి విషెస్ చెప్తూ మూవీ సక్సెస్ కావాలి, అని అన్నారు. పాంచజన్య ఫీచర్స్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ చిత్రం టీజర్ చూస్తే వినోదంతో నిండిన వినూత్న కథను చూపించబోతుందనే భావన కలుగుతోంది. ముగ్గురు యువకుల చుట్టూ తిరిగే కథ, వారి మధ్య ఉండే సరదా సంఘటనలు, స్టైలిష్ మేకింగ్ టీజర్‌కు ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఈ చిత్రానికి శ్రవణ్ జేష్ఠ దర్శకత్వం వహిస్తూ నిర్మాణ బాధ్యతలు కూడా చేపట్టారు. టీజర్‌లో కనిపించిన ఎనర్జీ, ప్రెజెంటేషన్ సినిమాపై అంచనాలను పెంచుతున్నాయి. సంగీతాన్ని అజయ్ అరసాడ అందించగా, విజువల్స్‌కి మరింత ఆకర్షణను తీసుకొచ్చింది. టెక్నికల్ టీమ్ పని కూడా ప్రశంసనీయంగా కనిపిస్తోంది. టీజర్ విడుదలైన వెంటనే సోషల్ మీడియాలో మంచి స్పందన లభిస్తోంది. వినోదంతో పాటు కొత్తదనం చూపించబోతున్న ఎంఆర్పీ సినిమా నుంచి త్వరలో మరిన్ని విశేషాలు తెలియనున్నాయి. ఈ చిత్రం లో నరేష్ అగస్త్య, రాజ్ కుమార్ కసిరెడ్డి, సుదర్శన్, డొనాల్ బిష్త్, వెన్నెల కిషోర్, హర్షవర్ధన్,గగన్ విహారి తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు.

# టాలీవుడ్ లో విషాదం..
# నిర్మాత చిట్టి బాబు కన్నుమూత

టాలీవుడ్ లో విషాదం చోటుచేసుకుంది. నిర్మాత, విశ్లేషకులు త్రిపురనేని వరప్రసాద్(చిట్టి బాబు) కన్నుమూశారు. మంగళవారం రాత్రి ఆయనకు చాతిలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు హుటాహుటినా ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మరణించినట్లు వైద్యులు తెలిపారు. గుండెపోటు కారణంగా ఆయన చనిపోయారని డాక్టర్లు తెలిపారు. దీంతో ఆయన మృతిపట్ల పలువురు సినీ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.



# ‘ఎన్టీఆర్ నీల్’ వచ్చేది అప్పుడే



ప్రపంచవ్యాప్తంగా భారీ క్రేజ్ ఉన్న మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్... కెజిఎఫ్ సిరీస్, సలార్ లాంటి సెన్సేషనల్ హిట్స్ ఇచ్చిన డైరెక్టర్ ప్రశాంత్ నీల్‌తో భారీ యాక్షన్ సినిమా చేస్తోన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ చిత్రాన్ని తాత్కాలికంగా ‘ఎన్టీఆర్ నీల్’ మూవీ అని పిలుస్తున్నారు. ఈ సినిమాపై ఇటు ఫ్యాన్స్, అటు ఇండస్ట్రీ వర్గాల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తోన్న ఈ ప్రాజెక్ట్ షూటింగ్ శర వేగంగా జరుగుతోంది. తాజాగా మేకర్స్ ఈ సినిమా ఫస్ట్ గ్లింప్స్, రిలీజ్ డేట్ గురించి వివరాలను తెలియజేశారు. ఈ సినిమా ఫస్ట్ గ్లింప్స్‌ను మే 20న ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా రిలీజ్ చేయబోతున్నారు.ఈ గ్లింప్స్ ఒక పవర్‌ఫుల్ సినిమాటిక్ వరల్డ్‌ను పరిచయం చేస్తుందని మేకర్స్ చెబుతున్నారు. ఇక ఈ సినిమా జూన్ 11, 2027న శుక్రవారం థియేటర్లలోకి రానుంది. తాజాగా రిలీజ్ చేసిన పోస్టర్‌లో ఎన్టీఆర్ నీడలాంటి ఓ లుక్‌లో కనిపిస్తున్నారు. తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ సహా పలు భాషల్లో ఈ మూవీ విడుదల కాబోతోంది. ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్ బ్యానర్‌లో కల్యాణ్ రామ్ నందమూరి, నవీన్ ఎర్నేని, రవిశంకర్ యలమంచిలి, హరికృష్ణ కొసరాజు నిర్మిస్తున్నారు.

# ప్రాణంపెట్టి ‘గేదెల రాజు’ సినిమా తీశా : చైతన్య మోటూరి




‘ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి ‘గేదెల రాజు’ సినిమాను పూర్తిచేశా. ఈ సినిమాకు ‘కాకినాడ తాలూకా’ అనేది ఉపశీర్షిక. ‘డియర్ కామ్రేడ్’ సినిమాతో అసిస్టెంట్ డైరెక్టర్‌గా సినీ ప్రస్థానంలోకి వచ్చా. ఇప్పుడు నా దర్శకత్వంలోనే గేదెలరాజు సినిమాను తెరకెక్కించా. శుక్రవారంనాడు ఈ సినిమా థియేటర్లలో విడుదల కానుంది. ప్రచార కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టాము. ‘గేదెల రాజు’ లాంటి రౌడీషీటర్ హత్య చుట్టూ ఇరుక్కుపోయిన ఐదు విభిన్నమైన జీవితాల చుట్టూ జరిగే కథగా తెరకెక్కించా. ఓ కరడుగట్టిన ఫ్యాక్షనిస్ట్‌ని ధైర్యంగా ఎదిరించి అతడి పంజరంలో చిక్కుకున్న ఆడపిల్లకు రక్షకుడుగా కొందరు యువతీ యువకులు నిలవడం కథ. రవి చిన్నబిల్లి, యంగ్‌మెన్స్ హ్యాపీ క్లబ్ సెక్రటరీ, థియేటర్ ఆర్టిస్ట్ శివయ్య మరో రోల్‌గా నటించారు. ఇందులో జొప్పించిన ప్రేమకథలో రామచంద్రం పుణ్యమంతుల- పీన శ్రావ్య, వికాస్ ముప్పల- మౌనిక కలపాల నటించారు. శ్రీకాంత్ అయ్యంగార్-కిట్టయ్యలు కూడా పాత్రలు పోషించారు. మహిళా పోలీస్ అధికారిగా నా సతీమణి దివ్య కీలకమైన రోల్‌లో చేశారు. ఈ సినిమాకు అవసరమైన డబ్బులను తల్లిదండ్రులు వాణి రవి కుమార్ ఆస్తులమ్మి ఏర్పాటుచేశారు. సినీ గాయకుడు రఘు కుంచే టైటిల్ రోల్ పోషించారు. రవి ఆనంద్ చిన్నిబిల్లి, రామచంద్రం, శ్రావ్య, వికాశ్, మౌనిక తదితరులు ప్రధాన తారాగణం. కథ, మాటలు, స్క్రీన్ ప్లే, దర్శకత్వ బాధ్యతలు మొత్తం నేనే చూశా. నాది బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా మండల కేంద్రమైన ఉప్పలగుప్తం. ఫిజియోథెరపీ డాక్టరుగా కాకినాడలో వైద్యసేవలు అందిస్తున్నా. సినిమాపైటట ఉన్న ఫ్యాషన్‌తో గేదెలరాజును నిర్మించా. ప్రేక్షకులు ఆదరించాలని కోరుతున్నా’ అని దర్శకుడు చైతన్య మోటూరి అన్నారు.



# ‘వింటారా సరదాగా’లో శివాత్మిక

శివాత్మిక రాజశేఖర్, అశోక్ గల్లా సినిమా ‘వింటారా సరదాగా’ చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. కొద్ది రోజులుగా ఆమె ఈ సినిమాలో నటిస్తుందన్న వార్తలు వినిపిస్తున్నాయి. తాజాగా శివాత్మిక పుట్టినరోజు సందర్భంగా చిత్ర బృందం ఆమెకు శుభాకాంక్షలు చెబుతూ ట్వీట్ చేసింది. హీరో అశోక్ గల్లా కూడా ఆమెకు విషెస్ చెప్పారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్‌లో ఈ సినిమా రూపొందుతోంది. ఉద్భవ్ రఘు ఈ సినిమాని తెరకెక్కిస్తున్నారు. విజరు బుల్గానిన్ సంగీతం అందిస్తున్నారు. శ్రీగౌరి ప్రియ అశోక్ గల్లా సరసన హీరోయిన్‌గా నటిస్తున్నారు.

## అందుకే స్టార్ హీరోలు తమ కూతుళ్లను
# సినిమాల్లోకి పంపరు: జేడీ చక్రవర్తి



ఎప్పుడూ ముక్కుసూటిగా మాట్లాడే సినీ నటుడు జేడీ చక్రవర్తి, తాజాగా ఒక ఇంటర్వ్యూలో తెలుగు సినీ పరిశ్రమలోని కొన్ని చేదు నిజాలను బయటపెట్టారు. ముఖ్యంగా నటీమణులకు ఎదురయ్యే సవాళ్లు, అగ్ర హీరోల ఆలోచనా దృక్పథంపై ఆయన చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. ఇండస్ట్రీలో ఎన్నో అన్యాయాలు జరుగుతున్నాయని, కానీ అవి బయటి ప్రపంచానికి తెలియవని జేడీ పేర్కొన్నారు. తెలిసిన వారు కూడా భయం వల్ల నోరు విప్పరని చెప్పారు. అగ్ర హీరోలు తమ కూతుళ్లను వెండితెరపై చూడటానికి ఎందుకు వెనకాడుతారనే ప్రశ్నపై స్పందిస్తూ... ఇక్కడ ఉండే పరిస్థితులు, ఆడపిల్లల పట్ల ఉండే ధోరణే దానికి ప్రధాన కారణమని అన్నారు. ఇతర భాషల నటీమణులకు ఇచ్చే ప్రాధాన్యత మన తెలుగు అమ్మాయిలకు దక్కడం లేదని, ప్రతిభ ఉన్నా కొన్ని అలిఖిత నిబంధనలు వారిని అడ్డుకుంటున్నాయని నెటిజన్లు వ్యాఖ్యానిస్తున్నారు. గతంలో సీనియర్ నటి రాధికా శరత్ కుమార్ కూడా తన భర్త తమ కుమార్తెను సినిమాల్లోకి పంపడానికి ఇష్టపడలేదని చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకుంటున్నారు.

# బెల్లంకొండ ఇంట పెళ్లి బాజాలు..

## మెగాస్టార్‌కు పెళ్లి పత్రిక అందజేసిన సాయి శ్రీనివాస్



టాలీవుడ్ యువ కథానాయకుడు బెల్లంకొండ సాయి శ్రీనివాస్ త్వరలోనే ఓ ఇంటివాడు కాబోతున్నారు. గత కొంతకాలంగా ఆయన పెళ్లిపై వస్తున్న వార్తలకు తెరదించుతూ, వివాహ వేడుకలకు అధికారికంగా శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో పెళ్లి శుభలేఖను మెగాస్టార్ చిరంజీవికి అందజేసి, ఆయన ఆశీస్సులు అందుకున్నారు. ఇవాళ సాయి శ్రీనివాస్ తన తండ్రి, ప్రముఖ నిర్మాత బెల్లంకొండ సురేశ్, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి చిరంజీవి నివాసానికి వెళ్లారు. తమ కుటుంబ వేడుకకు తప్పకుండా హాజరు కావాలని మెగాస్టార్‌ను సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా చిరంజీవి కాబోయే వరుడు సాయి శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలిపి, ఆశీర్వదించారు. ఈ ఆత్మీయ కలయికకు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అభిమానులు, నెటిజన్లు `SreenivasaKalyanam` అనే హ్యాష్‌ట్యాగ్‌తో కొత్త జంటకు ముందస్తు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ఈ వివాహ వేడుకను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు బెల్లంకొండ సురేశ్ భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ పెళ్లికి టాలీవుడ్‌కు చెందిన పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు హాజరుకానున్నారని సమాచారం.

# ‘జబర్దస్త్’కు రీఎంట్రీ ఇచ్చిన నాగబాబు..
# మళ్లీ మొదలైన సందడి!

- ‘జబర్దస్త్’ జడ్జ్‌గా తిరిగి వచ్చిన మెగా బ్రదర్ నాగబాబు
- పడిపోయిన రేటింగ్స్‌ను పెంచేందుకు నిర్వాహకుల ప్లాన్
- ఆ కుర్చీ ఎప్పటికీ మీదేనంటూ నాగబాబుకు రష్మీ స్వాగతం
- షోలో పాత కమెడియన్ల రీఎంట్రీపై మొదలైన చర్చ
- పొలిటికల్ సెటైర్లు కూడా పెరిగే అవకాశం




ఒకప్పుడు తెలుగు టెలివిజన్‌లో టాప్ రేటింగ్స్‌తో దూసుకెళ్లిన ప్రముఖ కామెడీ షో ‘జబర్దస్త్’, గత కొంతకాలంగా తన ప్రభావాన్ని కోల్పోయింది. పడిపోయిన రేటింగ్స్‌తో వెనుకబడిన ఈ షోకు మళ్లీ పునర్వైభవం తీసుకొచ్చేందుకు నిర్వాహకులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా షోకు మొదటి నుంచి పెద్ద దిక్కుగా ఉన్న ప్రముఖ నటుడు నాగబాబును తిరిగి జడ్జ్‌గా తీసుకువచ్చారు. నాగబాబు రాకతో షోలో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. “ఈ కుర్చీ ఎప్పటికీ మీదే సార్” అంటూ యాంకర్ రష్మీ ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ.. తాను షోలో లేకపోయినా ఎప్పుడూ దాని గురించే ఆలోచించేవాడినని, ఎవరైనా తప్పు చేస్తే సెట్‌కు వచ్చి మందలించాలనిపించేదని అన్నారు. ఆయన మాటలు ఈ షోపై తనకున్న అనుబంధాన్ని తెలియజేశాయి. నాగబాబు నవ్వులు టీమ్‌లో కొత్త ఎనర్జీ నింపుతున్నాయని కమెడియన్లు చెబుతున్నారు. ప్రస్తుతం షోలో కొత్త కమెడియన్లు ఎక్కువగా ఉండగా, ఈ అంశాన్ని కూడా స్కిట్లలో సరదాగా ప్రస్తావిస్తున్నారు. మరోవైపు బుల్లెట్ భాస్కర్ స్కిట్‌లో “నేను ఏమైనా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ అయ్యానా?” అంటూ వేసిన పొలిటికల్ సెటైర్ కూడా బాగా పేలింది. దీంతో భవిష్యత్తులో ఇలాంటివి మరిన్ని ఉండొచ్చని ప్రేక్షకులు అంచనా వేస్తున్నారు. నాగబాబు తన పాత టీమ్‌ను, ముఖ్యంగా చమ్మక్ చంద్ర వంటి వారిని మళ్లీ వెనక్కి తీసుకొస్తారా అనే దానిపై ఊహాగానాలు మొదలయ్యాయి. ఈ మార్పులతో జబర్దస్త్ మళ్లీ తన పాత స్థానాన్ని దక్కించుకుంటుందో లేదో చూడాలి.